
సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 24 । జనవరి । 2025



అభివృద్ధి లోగిలి

చేవెళ్ల నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటైన శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. 10లో▸



ఉద్యమానికి మద్దతు ఇద్దాం

ఎమ్మార్పీఎస్ లక్ష డప్పుల కార్యక్రమానికి బీసీల మద్దతు ఇద్దామని ఈ సంఘం నేత దరువు అంజన్న అన్నారు. 10లో▸



లక్ష్యం ఘనం..

జిల్లాలో చేపపిల్లల పంపిణీ తూతూమంత్రం గా సాగింది. 1.29కోట్లకు గాను కేవలం 12 లక్షల చేపపిల్లలే వదిలారు. 11లో▸

న్యూస్‌రీల్

ఎవరూ అధైర్యపడొద్దు

- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- మల్టీజోన్ – 2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

దుద్యాల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు అధైర్య పడరాదని మల్టీజోన్ –2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం దుద్యాల్ మండలం హకీంపేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్‌ఐ భరత్ రెడ్డి, ట్రైనీ ఎస్‌ఐ రాహుల్, మోహన్, కోస్గి ఎంపీడీవో శ్రీధర్, కాంగ్రెస్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, మెడికల్ ఆఫీసర్ నిర్మల, ఏవో హిమబిందు, ఆర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ సుధీర్



బంట్వారం గ్రామసభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

బంట్వారం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం బంట్వారం, మద్వాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రజలకు వివరించారు. అర్హుల జాబితాలో పేర్లు రానివారు ఎవరైనా ఉంటే గ్రామసభలో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధారూరు స్టేషన్‌లో రైళ్లు ఆగేలా చూడండి



జీఎం, డీజీఎంలకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధారూర్: ధారూరు స్టేషన్‌లో హుబ్లీ, బీజాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాండూరు ప్యాసింజర్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్, డీజీఎం కె.ఉదన్నాథను బీజేపీ నాయకులు కోరారు. గురువారం నగరంలో ఆయన్ను కలిసి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సిఫారసు లేఖను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో పై పేర్కొన్న రైళ్లు ధారూరులో ఆగేవని.. కొంత కాలంగా ఆపడం లేదని తెలిపారు. దీంతో ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాలను జీఎం, డీజీఎంల దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వి.నందు, మండల అధ్యక్షుడు రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం

వసూలు కొంతే!

పన్నుల వసూలులో డీలా.. నాలుగు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి

- పరిగి, వికారాబాద్‌లలో 50%
- కొడంగల్‌లో 42 శాతమే..
- తాండూరులో 12 శాతానికే పరిమితం
- మిగిలింది మరో రెండు నెలలే..
- పేరుకుపోతున్న మొండి బకాయిలు

మున్సిపాలిటీల్లో పన్నుల వసూలు డీలా పడ్డాయి. జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండగా పన్నుల వసూళ్లు ఇంకా 50 శాతం దాటడంలేదు. జిల్లాలోనే పెద్ద మున్సిపాలిటీ అయిన తాండూరులో పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. ఇక్కడ కేవలం 12 శాతమే వసూలు చేశారు. పరిగి మున్సిపాలిటీలో రూ.1.5 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.75 లక్షలు వసూలు చేశారు. వికారాబాద్‌లో రూ.4.38 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.2.46 కోట్లు వసూలు చేశారు. కొడంగల్‌లో రూ.1.95 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ. 82 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇక తాండూరులో రూ.13 కోట్లకు గాను రూ.1.85 కోట్లు అంటే 12.12 శాతం వసూలు చేశారు.

రాష్ట్రంలో చివరి స్థానం



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: మరో రెండు నెలల్లో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది.. మున్సిపాలిటీకి ఆస్తి పన్నే ప్రధాన ఆదాయ వనరు. ఇంటి పన్ను వసూలులో తాండూరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే చివరి స్థానంలో ఉంది. ఆన్‌లైన్ ద్వారా పన్నులు సేకరించాలి. అయితే ఇందుకు వినియోగించే మిషన్లు 6 నెలలుగా పని చేయడం లేదు. దీంతో ఇప్పటి వరకు కేవలం 12.12 శాతమే వసూలు చేశారు. మిగిలిన పన్నులు మార్చి నెలాఖరుకు పూర్తి చేసే అవకాశం కనిపించడం లేదు. గత ఆర్థిక సంవత్సరం మొదటి నెల నుంచే పన్నుల వసూలు ప్రక్రియను ప్రారంభించి మార్చి నాటికి 100 శాతం లక్ష్యం చేరుకునేవారు. అయితే తరచూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు తీసుకోవడం.. సర్వేలు చేయించడం లాంటివి పన్నుల వసూలుపై ప్రభావం పడింది. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులు 14,707 ఆవాసాలున్నాయి. ఏటా ఆస్తి పన్ను రూపంలో మున్సిపాలిటీకి రూ.13.04కోట్ల ఆదాయం చేకూరుతుంది. ఈ సారి పన్నుల వసూలులో అధికారులు ఆసక్తి చూప లేదనే చెప్పొచ్చు. ఇప్పటి వరకు రూ.1.58 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయగా ఇంకా రూ.11.02 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో మొత్తం 152 మున్సిపాలిటీలున్నాయి. ఆస్తి పన్ను వసూలులో తాండూరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలిచింది. వచ్చే నెల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పన్నుల వసూలుకు కొత్త యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

రూ.81.96 లక్షల వసూలు

కొడంగల్: కొడంగల్ పురపాలక సంఘానికి సంబంధించి ఈ ఏడాది 42 శాతం పన్ను వసూలు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.194.82 లక్షలు టార్గెట్ ఉండగా ఇప్పటి వరకు రూ. 81.96లక్షలు వసూలు చేశారు. 42.7 శాతం వసూలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి రూ.20.72 లక్షలు ఉండగా రూ.82 వేలు వసూలు చేశారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి ప్రాపర్టీ టాక్స్ రూ.165.32 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా రూ.78.51 లక్షలు మాత్రమే వసూలు చేశారు. 68.79 శాతం వసూలైంది. ఇందులో ప్రభుత్వ భవనాలకు సంబంధించి ప్రాపర్టీ టాక్స్ రూ.16.07 లక్షలు ఉండగా రూ.2.7 లక్షలను వసూలు చేశారు. మార్చి నెల చివరి వరకు వంద శాతం పన్ను వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు.



కొడంగల్ మున్సిపల్ కార్యాలయం

పరిగి మున్సిపాలిటీలో 50 శాతం వసూలు



పరిగి: పరిగి మున్సిపాలిటీలో ఈ ఏడాది 90శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది 89 శాతం వసూలు చేశారు. ఇప్పటి వరకు 50శాతం(రూ.75లక్షలు) పన్నులు వసూలు చేశారు. గత ఏడాది రూ. కోటి 24లక్షలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. పాత బకాయిలతో పాటు మొత్తం పన్ను రూ. 2.45 కోట్లు ఉందని పేర్కొన్నారు. మార్చిలోపు లక్ష్యం పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు.

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు 56.35శాతం పన్నులు వసూలు చేశారు. మరో రెండు నెలల్లో 100శాతం వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. గత ఏడాది 91.66 శాతం వసూలు చేశారు. ఈ సారి కాస్త వెనుకంజలో ఉన్నారు. ఇందుకు ప్రధాన కారణం రెండు మూడు నెలల నుంచి మున్సిపల్ బిల్ కలెక్టర్లకు సమగ్ర కుటుంబ సర్వే, ప్రజాపాలన, ఇందిరమ్మ ఇండ్లు తదితర సర్వేలు, రేషన్ కార్డుల సర్వే, వార్డు సభలు వంటి బాధ్యతలు అప్పగించడంతో పన్నులు వసూళ్లపై శ్రద్ధ పెట్టలేకపోయారు. మున్సిపల్ పరిధిలో 15,092 ఇండ్లు ఉండగా పన్ను రూపంలో రూ.4.38 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు రూ. 2.46కోట్లు వసూలు చేశారు. ఇంకా 1.91కోట్లు వసూలు చేయాల్సి ఉంది. స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటు చేసి వంద శాతం లక్ష్యం చేరుకుంటామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వంద శాతం పన్నులు వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు.

లక్ష్యం రూ.4.38 కోట్లు

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే..!

- 2018లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న యువకులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వినతి



కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయం

కొడంగల్: నియోజకవర్గంలో నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి పథకంలో భాగంగా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు అతీగతీ లేదు. రుణాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలకు పిలిచి అర్హులను గుర్తించారు. అప్పట్లో రుణాలు వస్తాయని లబ్ధిదారులు భావించారు. ముందస్తు ఎన్నికలతో ప్రక్రియ ఆగిపోయింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావడంతో రుణాల పంపిణీ నిలిచిపోయింది. తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వచ్చాయి. అనంతరం మున్సిపల్ ఎన్నికలు రావడంతో మరోసారి రుణాల పంపిణీ ఆగిపోయింది. గతంలో గ్రామానికి ఒకరిద్దరిని ఎంపిక చేసి రూ.50 వేలు, రూ. లక్షలోపు ఉన్న వారికి కొందమందికి చెక్కులు ఇచ్చారు. పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు ఇవ్వలేదు. స్వయం ఉపాధి కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఇవ్వాల్సిన రుణాలు పెండింగ్‌లో పడ్డాయి. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎదురుచూపులు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలవారి ఉపాధి కోసం సబ్సిడీపై రుణాలు అందించాలని నిర్ణయించింది. 2015–16 ఆర్థిక సంవత్సరం మొదలుకొని 2017–18 ఆర్థిక సంవత్సరం వరకు దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇవ్వాల్సి ఉంది. బీసీ యువకుల స్వయం ఉపాధికి మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చొరవ తీసుకొని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

- జాతీయ కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ మెడోస్



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసిన డాక్టర్ అనురాధ మెడోస్ తదితరులు

అనంతగిరి: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని జాతీయ కుటుంబ సంక్షేమ శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ మెడోస్ వైద్యులకు సూచించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా గురువారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణతో కలిసి వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి వైద్య విద్యార్థులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. అనంతరం పాలిటివ్ కేర్ విభాగాన్ని సందర్శించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ అవసాన దశలో ఉన్న రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. అక్కడి నుంచి మహావీర్ వైద్య కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లతో మాట్లాడారు. కళాశాలలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. టీబీ కేసులకు ఉచితంగా మందులు అందించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిశారు. మూడు రోజుల పర్యవేక్షణలో జిల్లాలో పరిశీలించిన వివిధ అంశాలను వివరించారు.

ఆ పార్టీలను నమ్మే పరిస్థితి లేదు



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసింది
- హామీల అమలులో కాంగ్రెస్ అభాసుపాలు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టిందని, ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక అభాసుపాలు అవుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం ఇటీవల నూతనంగా ఎన్నికైన బూత్‌స్థాయి అధ్యక్షులు, మండల అధ్యక్షుల సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, కేంద్రం నుంచి వచ్చే నిధులే ఇప్పుడు దిక్కయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. బీజేపీ బలోపేతాన్ని చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు బదనాం చేసేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించటంతోపాటు తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారికి బుద్ధి చేపేందుకు త్వరలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కంజర్ల ప్రకాశ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అభివృద్ధి పనులు ప్రారంభించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్: నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని కడా కార్యాలయంలో కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, శిక్తాపట్నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కలాశాలలతోపాటు బొంరాస్‌పేట, గుండుమాల్ మండలాల్లో చేపట్టే సమీకృత పాఠశాల భవనాల నిర్మాణ పనులను త్వరలో చేపట్టాలని సూచించారు. వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించి పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, గరిమనరుల, కడా కార్యాలయ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నారాయణపేట ఆర్డీఓ రామచందర్, పంచాయత్‌రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ రంగారెడ్డి కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సతీష్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ నరేష్ పదోన్నతి పొంది రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ హెడ్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. పదోన్నతిపై వెళ్లిన డాక్టర్ నరేష్‌కు వీడ్కోలు పలికారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- కిష్టాపూర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



కిష్టాపూర్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం దోమ మండలం కిష్టాపూర్‌లో రూ.1.13కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందన్నారు. గత ప్రభుత్వం ప్రజలను విస్మరించి పాలన సాగించిందన్నారు. ఆరు లక్షల రేషన్ కార్డులు తొలగించి పేదలకు బియ్యం, సరుకులు అందకుండా చేసిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. త్వరలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఆ తర్వాత పట్టణ పరిధిలోని కేజీబీవీని సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. చదువు బాగు చెబుతున్నారా? భోజనం సక్రమంగా.. మెనూ ప్రకారం అందిస్తున్నారా? అని ఆరా తీశారు. ఇబ్బందులు ఏమైనా ఉంటే చెప్పాలన్నారు. పాఠశాల ఆవరణలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రహరీ చిన్నగా ఉందని, ఎత్తు పెంచేందుకు నిధులు మంజూరు చేయాలని ఎస్‌ఓ చైతన్య ఎమ్మెల్యేను కోరారు. త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్‌బాబు, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, డైరెక్టర్ శాంతుకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములునాయక్, మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే సర్వేలు, సభలు

- ఎమ్మెల్యే సబితా రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

మీర్‌పేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమే సర్వేలు, సభలు తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి విమర్శించారు. కార్పొరేషన్‌లో రూ.4.42 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని ఓ వైపు మంత్రులు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం తాము చెప్పిన వారికే ఇస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తుండడంతో గ్రామ సభలను నిర్బంధాల మధ్య నడుపుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు మంజూరు చేసిన కోట్లాది రూపాయలను నిలిపివేయడం రాజకీయం కాదా అని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలు, సమావేశాలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, మాదరి సురేఖ, బొక్క రాజేందర్‌రెడ్డి, గడ్డమీది రేఖ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య

కొడంగల్ రూరల్: సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య కోరారు. గురువారం పట్టణంలోని ఆటోస్టాండులో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ నెల 25న నిర్వహించే బహిరంగసభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, మల్లయ్య, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

26న 'లక్ష డప్పులు' సన్నాహక సదస్సు

యాలాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 26న 'వేయి గొంతులు-లక్ష డప్పులు' సన్నాహక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్టు పార్టీ) జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, ఎమ్మార్పీఎస్ యాలాల మండల అధ్యక్షుడు మెట్టి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని మాదిగ, ఉపకులాల ప్రజలు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని వారు కోరారు.

పూత రాలకుండా నీరందించాలి

రంగారెడ్డి ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త యమున రెడ్డి



మామిడి రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త యమున రెడ్డి

దుద్యాల్: మామిడి రైతులు పూత దశలోనే జాగ్రత్తలు పాటించాలని రంగారెడ్డి ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త యమున రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలోని రైతు లక్ష్మారెడ్డి మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి చెట్లు పూత దశలో ఉన్నాయి. పిందెలు కాసినన్ని రోజులు పూతను కాపాడుకోవాలని చెప్పారు. పూత రాలకుండా మొక్కకు స్వల్పంగా నీరందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భీంరెడ్డి, మహిపాల్, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా 'మీ సేవ'లు

ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మీ సేవా నిర్వాహకులు

కొడంగల్: పట్టణంలోని ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడు అనధికారికంగా మీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని స్థానిక మీ సేవా కేంద్రాల నిర్వాహకులు గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకున్నా ఇతర మీ సేవా కేంద్రం ఐడీ నంబర్‌తో కుల, ఆదాయ, స్థానిక ధృవీకరణ పత్రాలు, ఇస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ పత్రాలు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు నరేందర్ రావు, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం



వివేకానందనగర్ కాలనీలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు

శంకర్‌పల్లి.. అభివృద్ధి లోగిలి

ఎమ్మెల్యే సారథ్యంలో మున్సిపాలిటీలో ప్రగతి

- రూ.వంద కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు
- ఆదర్శ పురపాలికగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి

శంకర్‌పల్లి: చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో ఏర్పడిన తొలి మున్సిపల్ అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం అందలమెక్కింది. మండల కేంద్రం నుంచి మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయితే ఎలాంటి అభివృద్ధి ఉంటుందనేది ఈ పురపాలికను చూస్తే అవగతమవుతోంది. గడిచిన ఐదేళ్లలో సుమారు వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం గమనార్హం. మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి వ్యవస్థ, నీటి సరఫరా వ్యవస్థతో మున్సిపాలిటీ కళకళలాడుతోంది. రేపటితో (జనవరి 25) మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో 'సాక్షి' ప్రత్యేక కథనం

ఏడాదిన్నర తర్వాత పాలవర్గం

2018 ఆగస్టులో శంకర్‌పల్లి, బుల్కాపూర్, ఫత్తేపూర్, రామంతాపూర్, సింగాపూర్‌తో పాటు మరో నాలుగు గ్రామాలను కలుపుతూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శంకర్‌పల్లి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 21వేల జనాభా ఉండగా.. 15వార్డులుగా విభజించారు. మున్సిపల్ ఏర్పడినప్పటికీ ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గం ఏర్పాటుకు మాత్రం ఏడాదిన్నర సమయం పట్టింది. 2020 జనవరి 25న తొలి పాలకవర్గం ఏర్పడగా.. చైర్‌పర్సన్‌గా అప్పటి బీఆర్‌ఎస్ అభ్యర్థి సాత విజయలక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య(ఫైల్)

ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేక నిధులు

నియోజకవర్గంలోని ఏకైక మున్సిపాలిటీ కావడంతో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యేకున్న సాన్నిహిత్యంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేశారు. గతంలో మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రహదారులు, కాలనీల్లోని సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి వ్యవస్థ, పారిశుద్ధ్యం గందరగోళంగా ఉండగా.. ప్రస్తుతం ఒకదారిలోకి తీసుకొని వచ్చారు. అంతిమయాత్రకు వైకుంఠ రథం, నిత్యం చెత్త సేకరణకు అవసరమైన రెండు ఆటోలను కొనుగోలు చేశారు.

మంజూరైన నిధుల వివరాలు

14, 15 ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులు	రూ.15.50 కోట్లు
స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్	రూ.87.50 లక్షలు
ఎల్‌ఆర్‌ఎస్ నిధులు	రూ.30.80 లక్షలు
రాష్ట్ర నిధులు	రూ.3 కోట్లు
టీయూఎఫ్ఐడీసీ	రూ.37.58 కోట్లు
రూర్బన్ నిధులు	రూ.83 లక్షలు
హెచ్ఎండీఏ	రూ.ఒక కోటి
ఎంపీ ల్యాడ్స్	రూ.55.60 లక్షలు
అమృత్ 2.0	రూ.32.47 కోట్లు

పచ్చని 'వెలుగులు'

హరితహారం, పట్టణ ప్రకృతి వనం పేరిట మున్సిపాలిటీలో పచ్చదనం పెంపునకు పెద్దపీట వేశారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. వారాంతాల్లో పిల్లలు ఆడుకునేందుకు, వృద్ధులు సేదతీరడానికి పట్టణంలోని వివేకానందనగర్ కాలనీలో చిల్డ్రన్స్ పార్కుతో పాటు, మహిళలు, పిల్లలు వ్యాయామం చేసేందుకు గాను ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. బుల్కాపూర్ శివారు నుంచి శంకర్‌పల్లి పట్టణ చౌరస్తా వరకు నాలుగు వరుసల రహదారిపై డివైడర్‌ని ఏర్పాటు చేసి, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు.

అభివృద్ధికి నిరంతరం కృషి

మున్సిపాలిటీని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేశాం. ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో సుమారు రూ.వంద కోట్ల అభివృద్ధి పనులు చేయించుకున్నాం. ఐదేళ్లలో ప్రజలకు దగ్గరవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాను.

– సాత విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, శంకర్‌పల్లి

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య



మాదిరెడ్డిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మహేందర్‌రెడ్డి, యాదయ్య

నవాబుపేట: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామసభలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో రైతులకు రూ.770 కోట్ల రుణమాఫీ, వికారాబాద్ జిల్లాలో రూ.850 కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. సాంకేతిక కారణాలతో ఆగిన రుణమాఫీ సైతం త్వరలోనే పూర్తవుతుందన్నారు. నవాబుపేట మండలంలోనే 6,237 మంది రైతులకు రూ.43 కోట్ల రుణమాఫీ అయిందని గుర్తు చేశారు. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ జైరాం, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు వెంకటయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు ఇద్దాం

కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న



మాట్లాడుతున్న దరువు అంజన్న

కొడంగల్ రూరల్: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న చేపట్టనున్న వేలగొంతులు-లక్ష డప్పులు కార్యక్రమానికి బీసీలుగా మద్దతును ఇద్దామని బీసీ నేత, కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన సంఘీభావ సభలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పునిచ్చినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణలో మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాప్రదర్శనకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవి మోహన్‌బైరాగి, బీసీ సేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కన్నోజు వెంకటేశ్వర్లు, ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, గోవర్ధన్‌చారి, అంబేడ్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు రమేష్‌బాబు, శ్రీనివాస్, లక్ష్మప్ప, మల్లేష్ యాదవ్, చిన్నయ్య, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఉర్సు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉర్సు ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నేరేళ్ల చెరువులోని దర్గా హజ్రత్ షా మూసా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అల్లా దయ అందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయన కోరారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మౌనిక, హరికృష్ణ, పర్వేజ్ హుస్సేన్, అడ్డు, సయ్యద్ అద్నాన్ ఎల్లయ్య, నర్సింలు, సయ్యద్ సాబేర్, సాజిద్, నజీర్, మన్సూర్, జావిద్, జిలానీ, సయ్యద్ ఉస్మాన్, శివాచారి, పవన్ ఠాకూర్, సుధీర్, మధు తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

వ్యసనాలకు బానిసలవ్వొద్దు

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీదేవి

మంచాల: యువత వ్యసనాలకు బానిసలవ్వొద్దని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి పొన్న శ్రీదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని నోముల సమీపంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్ ఉచ్చులో చిక్కుంటే జీవితం అంధకారమవుతుందన్నారు. చిన్న వయస్సుల్లో యువత డ్రగ్స్ కేసులో జైలు జీవితం గడిపడం బాధాకరమన్నారు. కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల నుంచి బహిష్కరణ చేయడమే కాకుండా రెండేళ్ల జైలు శిక్ష, రూ.పదివేలు జరిమానా విధిస్తామన్నారు. ఈ సందర్భంగా లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సీహెచ్ రవి, ప్రిన్సిపాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీదేవి

'పశు సంక్రాంతి'కి సర్వం సిద్ధం

- నేడు నార్సింగిలో పశువుల జాతర
- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్
- జాతరకు ఆవులు, గేదెలను తరలించిన రైతులు

మణికొండ: హైదరాబాద్ నగర శివారు నార్సింగిలో ఏటా సందడిగా జరిగే పశుసంక్రాంతి జాతరను శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. నిజాం కాలంలో మొదలైన ఒరవడి నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిని (పశువులు) కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే నార్సింగి పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి ప్రస్తుతం మున్సిపాలిటీగా అవతరించి ఎటు చూసినా ఆకాశాన్నంటే టవర్‌లు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కన్వెన్షన్‌లు, ఔటర్ రింగ్ రోడ్డుతో కొత్త హైటెక్ నగరంగా అవతరించినా కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిగా నిర్వహిస్తారు.

- గుజరాత్, హరియాణా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు, రైతులు ఇక్కడకు తెచ్చి క్రయవిక్రయాలను నిర్వహిస్తుంటారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పశుసంక్రాంతిని ఈ సంవత్సరం శుక్రవారం నిర్వహించేందుకు మార్కెట్ కమిటీ పాలక కమిటీ ఏర్పాట్లు చేసింది.
- ప్రతి సంవత్సరం నార్సింగి పశు సంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఈసారి పంటలు బాగా పండటం, వరి పంట అధిక దిగుబడి రావటంతో రైతుల వద్ద డబ్బు ఉందని, పంటలకు తోడుగా పశువులను పెంచుకోవాలనే దిశగా రైతులు ఆలోచన చేస్తున్నారని, దాంతో శుక్రవారం జరిగే సంతలో బారీగానే అమ్మకాలు జరిగే అవకాశం ఉంటుందని పశు వ్యాపారులు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



బుచ్చయ్య(ఫైల్)

పరిగి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం పట్టణ కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన బాయికాడి చిన్న బుచ్చయ్య(68), ఘనపురం శ్రీనివాస్ పురుగుమందు కొనుగోలుకు పట్టణ కేంద్రానికి బయలుదేరారు. ఈ క్రమంలో బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు ఇండియన్ ఆయిల్ బంక్‌లోకి వెళ్లారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బుచ్చయ్య, శ్రీనివాస్ గాయాలవ్వడంతో పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను ఈశా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్న బుచ్చయ్య మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం



భానుప్రసాద్ (ఫైల్)

యాచారం: గ్రీన్‌ఫార్మా సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. సీఐ కృష్ణం రాజు తెలిపిన ప్రకారం.. నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గొరిగె భిక్షపతి, పార్వతమ్మ దంపతుల కుమారుడు భానుప్రసాద్ బొంగ్లూరు వద్ద ఉన్న నారాయణ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు వచ్చిన విద్యార్థి గురువారం మధ్యాహ్నం ఫోన్ ఇంట్లోనే పెట్టి బైక్ తీసుకుని బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

షాపింగ్ మాల్ ఎదుట కార్మికుల ధర్నా

షాద్‌నగర్: షాపింగ్ మాల్‌లో పని చేసేందుకు బైక్ వస్తున్న కార్మికుల వాహనాలకు భద్రత కల్పించాలని డిమాండ్‌తో గురువారం ధర్నా చేపట్టారు. చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్ ఎదుట చేపట్టిన ఈ ధర్నాకు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ.. చందన బ్రదర్స్ షాపింగ్‌మాల్‌లో పని చేస్తున్న ఇద్దరు కార్మికుల బైక్‌లు ఈ నెల 11న చోరీకి గురయ్యాయి. షాపింగ్‌మాల్ యాజమాన్యం సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌ను పెట్టకపోవడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని.. చర్యలు తీసుకోవడం లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

బైక్ ఢీకొని వాచ్‌మెన్ మృతి



ఘటనాస్థలిలో జంగయ్య మృతదేహం

యాచారం: బైక్‌ను వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వాచ్‌మెన్ అక్కడికక్కడే మృతి చెందాడు. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతపట్ల గ్రామానికి చెందిన నక్కమల్ల జంగయ్య(52) తక్కళ్లపల్లి సమీపంలోని గ్రావణ పవర్‌ప్లాంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని గురువారం ఉదయం తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఆయన సాగర్‌రోడ్డుపైకి వచ్చిన వెంటనే వెనుకనుంచి అంతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం జంగయ్య బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జంగయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఓ కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళను మోసం చేసిన వ్యక్తులకు రిమాండ్

కొత్తూరు: ఉద్దేశపూర్వకంగా ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని కొత్తూరు పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌కు చెందిన ఎడ్ల హంసమ్మ ఈ నెల 20న తన కోడలు రాధిక, మనుమడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో భాగంగా పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తుండగా ఈ నెల 22న రాధిక పోలీసుస్టేషన్‌కు చేరుకుని తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించింది. పెళ్లి సమయంలో తన తల్లిదండ్రులు ఎకరా పొలం ఇచ్చారు. గతేడాది ఆగస్టులో తన భర్త శ్రీకాంత్ డెంగీతో చనిపోయాడని.. ఈ క్రమంలో స్టేషన్ తిమ్మాపూర్‌కు చెందిన మహేందర్ శ్రీకాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టిన పెట్టుబడిన వివరాలు చెబుతానంటూ నమ్మించి ఎకరా పొలానికి సంబంధించిన పట్టాపాస్‌బుక్ తీసుకున్నాడని చెప్పింది. ఈ నెల 20న మహేందర్ తన డ్రైవర్ శేఖర్‌తో కలిసి తిరుపతి తీసుకెళ్లి మార్గమధ్యలో దాడి చేసి బంగారు రింగ్, నగదు తీసుకుని బాండ్ పేపర్లపై సంతకం పెట్టాలని బలవంతం చేశారని వాపోయింది. తిరుపతి నుంచి తిరిగి హైదరాబాద్‌కు తీసుకువచ్చి సంతకం పెట్టాలని లేదంటే నిన్ను, కుమారుడిని చంపేస్తామని బెదిరించారని.. వారు మద్యం మత్తులో ఉండగా తప్పించుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చానని పోలీసులకు వివరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మహేందర్, శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక చాకు, కారు, రెండు సెల్‌ఫోన్లు, ఉంగరం, కొంత నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందిని సీఐ అభినందించారు.

రాజ్యాధికారంతోనే డిమాండ్ల సాధన



బీసీ సేన అప్పారెడ్డిగూడ అధ్యక్షుడిని సన్మానిస్తున్న బర్క కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్: రాజ్యాధికారంతోనే హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో బీసీసేన సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ అధ్యక్షుడిగా పత్తి శేఖర్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శిగా సాయిరాంగౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్, సలహాదారులుగా శ్రీనివాస్, సభ్యులుగా మహేష్, శ్రీశైలం, శివ, రమేష్, లింగం, మల్లేష్, శ్రీకాంత్, శశికుమార్, మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలన్నారు.

చెస్‌లో సత్తాచాటుతున్న శివాంశిక

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శివాంశిక చెస్ క్రీడలో సత్తాచాటుతూ ముందుకు సాగుతోంది. ఏపీలోని పెద్దాపూర్‌లో జనవరి 17 నుంచి 21వ వరకు జరిగిన అండర్-15 బాలిక నేషనల్ జాతీయ స్కూల్ చాంపియన్‌షిప్-2025లో తెలంగాణ రాష్ట్రం నుంచి శివాంశిక పాల్గొంది. వివిధ విభాగాలలో 2500 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, వెస్ట్ బెంగాల్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వారందరిలో అసాధ్యమైన ర్యాంకులు సాధిస్తూ తనదైన శైలిలో ఎవరు ఊహించని విధంగా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ అంతర్జాతీయ చెస్ రంగంలో ఉన్న చెస్ క్రీడాకారుల ప్రశంసలు, ప్రోత్సాహాన్ని అందుకుంటోంది. పేదరికంలో ఉన్న శివాంశికకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహాన్నిస్తే దేశంలోనే అగ్ర స్థానానికి చేరుకుంటుందని.. మంచి కోచ్‌ను ఏర్పాటుచేస్తే ఉన్నత స్థానాలను తప్పక అధిరోహిస్తుందని మాస్ట్రో చెస్ అకాడమీ అత్తాపూర్ ట్రైనర్ అమిత్ పాల్‌సింగ్ ఈ సందర్భంగా శివాంశికను అభినందించారు. నిర్వాహకురాలు చెస్ క్రీడల్లో రాణించిన శివాంశికను ఘనంగా సత్కరించి ట్రోఫీ, రూ. 5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. తమ పాఠశాలలో చదువుకుంటూ చెస్‌లో రాణిస్తున్న శివాంశిక తమ పాఠశాల విద్యార్థిని కావడం తమకు ఎంతో సంతోషంతోపాటు గర్వకారణంగా కలిగిస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యా శాఖాధికారి (ఎంఈవో) శంకర్‌రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు సాయిప్రసాద్, గాంగ్యానాయక్ తదితరులు అభినందించారు.



చెస్‌లో రాణించి ట్రోఫీ, బహుమతి సాధించిన శివాంశిక

క్లుప్తంగా

ఇరుకు గదిలో విధులు



ఇరుకు గదిలో విధులు నిర్వర్తిస్తున్న ఏఈఓలు

దౌల్తాబాద్: మండలంలోని వ్యవసాయశాఖ సిబ్బంది ఓ ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వ్యవసాయశాఖకు సొంత భవనం లేకపోవడంతో స్థానిక కోఆపరేటివ్ కార్యాలయంలోని ఓ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే మండల కేంద్రంలో రైతువేదిక నిర్మించిన అది గ్రామానికి దూరంగా చెరువు దగ్గర ఉండడంతో అక్కడికి రైతులు ఎవరూ రావడంలేదు. ఈ విషయమై గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని సిబ్బంది, స్థానికులు అంటున్నారు. ప్రస్తుతం ఏఈఓలు, వ్యవసాయ అధికారి ఇరుకుగదిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వ్యవసాయ శాఖకు సొంత భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కళాశాల నిర్మాణానికి భూమిపూజ



కార్యక్రమంలో నాయకులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాలకు భవనం లేకపోవడంతో మండల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే భవనాన్ని నిర్మించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.4.79 కోట్లు నిధులు విడుదల చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో భవన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ ప్రసాద్, నాయకులు వీరన్న, దస్తప్ప, పకీరప్ప, కృష్ణ, శివరాంసింగ్ తదితరులున్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత




దౌల్తాబాద్: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని నీటూరు గ్రామంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుభద్రత, మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధం, డ్రంక్ అండ్ డ్రైవ్, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, అంటరానితనం, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రవిగౌడ్, సిబ్బంది తదితరులున్నారు.

పాఠశాలలో క్రీడా పోటీలు

దోమ: క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యా నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు 'జనవరి-26' సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించారు. చదువుతో పాటు క్రీడలను అలవాటుగా చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి



తుపాకుల తండాలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బండమీదితండా అనుబంధ గ్రామమైన తుపాకుల తండాలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలు నివసించే గిరిజన తాండాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, నాయకులు భరత్‌కుమార్, స్వామి, గోపాల్‌నాయక్, భరత్‌కుమార్‌రెడ్డి, వినోద్, విష్ణు, శంకర్ పాల్గొన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- జిల్లాలో నామమాత్రంగా చేపపిల్లల పంపిణీ
- సీజన్ పూర్తి కావడంతో మత్స్యకారుల ఆందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం

వికారాబాద్: లక్ష్యం ఘనం.. ఆచరణలో శూన్యం అన్న చందంగా ఈ ఏడాది చేపపిల్లల పంపిణీ మారింది. వందశాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తున్న చేప పిల్లల పంపిణీ వర్షాకాలం ముగిసినా ముందుకు సాగడంలేదు. దీంతో మత్స్య సహకార సంఘాలు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. కొంతమంది సొంత డబ్బులతో కొనుగోలు చేసి చేపపిల్లలను చెరువుల్లోకి వదులుకుంటున్నారు. దీనిపై వర్షాకాలం ఆరంభం నుంచి కసరత్తు చేస్తున్నామని చెబుతున్న మత్స్య శాఖ పంపిణీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ టార్గెట్‌లో పది శాతం కూడా పూర్తి చేయలేకపోయింది. చేపపిల్లలు వదిలేందుకు జులై మాసంలోనే టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. కేవలం జిల్లాలో 14 చెరువుల్లో 13.40 లక్షల చేపపిల్లలు వదిలేందుకు మాత్రమే టెండర్లు పూర్తి చేశారు. ఇందులో 12 చెరువుల్లో 12 లక్షల చేప పిల్లలు మాత్రమే విడిచారు. గతేడాది రాయితీపై పంపిణీ చేసిన చేపపిల్లలకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న వారికి ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని, అందుకే టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావటంలేదని మత్స్య సహకార సంఘాల నేతలు పేర్కొంటున్నారు.



చెరువులో వదులుతున్న చేపపిల్లలు (ఫైల్)

పది శాతంలోపే..

జిల్లాలో మొత్తం 139 మత్స్య సహకార సంఘాలు ఉండగా ఇందులో 5,142 మంది సభ్యులు ఉన్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు వంద శాతం రాయితీపై వదలాల్సిన చేపపిల్లల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. చేపపిల్లలు వదిలేందుకు ఏ చెరువులు అనుకూలంగా ఉన్నాయనే అంశాన్ని వర్షాకాలం ఆరంభంలోనే అంచనాలు సిద్ధం చేసిన మత్స్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జూలై 15వ తేదీ నుంచి 23 వరకు బిడ్లు వేసేందుకు గడువు ఇచ్చింది. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టులో చేప పిల్లల పంపిణీ ప్రారంభిస్తామని పేర్కొన్న ఆ శాఖ ఇప్పటి వరకు ఉలుకుపలుకు లేకుండా ఉంది. కేవలం 14 చెరువులకు సంబంధించి మాత్రమే పెద్దసైజు చేప పిల్లలు వదిలేందుకు టెండర్లు ఖరారయ్యాయి. చిన్న సైజు చేపపిల్లలకు సంబంధించి ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 746 చెరువుల్లో చేపపిల్లలు వదలాలని నిర్ణయించారు. ఈ ఏడాది 1.29 కోట్ల చేప పిల్లలు, 14.97 లక్షల రొయ్య పిల్లలు వదలాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇందులో 12 చెరువులో 12 లక్షల చేప పిల్లలు మాత్రమే వదిలారు.

జిల్లాలో మొత్తం చెరువులు	1179
చేపలు వదిలేందుకు గుర్తించినవి	746
వదలాల్సిన చేపపిల్లల లక్ష్యం	1.29 కోట్లు
చెరువుల్లో వదిలింది	12 లక్షలు

ప్రతిసారి ఇంతే

చెరువుల్లో చేపపిల్లలు వదిలే విషయంలో అధికారులు ఎంచుకున్న లక్ష్యాన్ని ఎప్పుడూ అందుకోలేక పోతున్నారు. ఎంచుకున్న లక్ష్యంలో కేవలం 60 నుంచి 70 శాతం వరకే చేపపిల్లలు వదిలి ప్రభుత్వం చేతులు దులుపుకొంటుంది. గతేడాది కూడా లక్ష్యానికి దూరంగా చేపపిల్లల పంపిణీ ఆగిపోయింది. ఈ ఏడాది అయిన చెరువుల్లో సరిపడా చేపపిల్లలు వదులుతారని మత్స్య సహకర సంఘాలు పెట్టుకున్న ఆశలు నీరుగారి పోయాయి. ఏటా ప్రభుత్వం వందశాతం రాయితీపై చెరువుల్లో వదులుతున్న చేపపిల్లల్లో ఎక్కువ శాతం నాసిరకంగా ఉంటున్నాయి. ఈ విషయమై మత్స్యశాఖ ఏడీ వెంకటయ్యను వివరణ కోరగా.. టెండర్లు పూర్తయినంత వరకు 12 లక్షల చేపపిల్లలు చెరువుల్లో వదిలామని తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రీడోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతగిరి: ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడోత్సవం వాల్ పోస్టర్‌ను వికారాబాద్‌లో ఆ సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ హరీష్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, పోరాట పటిమ, సమయపాలన సిద్ధిస్తాయన్నారు. ఖేల్ భారత్ పేరుతో దేశవ్యాప్తంగా ఏబీవీపీ చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రాణిస్తున్నారన్నారు. ఈ పోటీలు ఈనెల 27 నుంచి బ్లాక్‌గ్రౌండ్‌లో ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మహేష్ సాగర్, నాయకులు దయాకర్, సంజీవ్, శ్రీధర్, మురళీకృష్ణ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే మంచి మార్కులు

బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్

అనంతగిరి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్ అన్నారు. ఈమేరకు గురువారం వికారాబాద్ పట్టణం ఆలంపల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆల్ ఇన్ వన్ మోడల్ పేపర్స్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరీక్షల కాలం ఉన్నందున బాగా చదివి ఉత్తమ జీపీఏలతో ఉత్తీర్ణులు కావాలన్నారు. నిత్య సాధనతోనే మంచి మార్కులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్, అలీమొద్దీన్, అలీ తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

స్వాతంత్ర్య పోరులో నేతాజీ కీలకం



తాండూరు టౌన్: నేతాజీ విగ్రహం వద్ద విద్యార్థులు, నాయకులు

పరిగి: దేశ ప్రజలను బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేయడంతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటం మరువలేనిదని బీజేపీ నియోజకర్గ కన్వీనర్ నరసింహ అన్నారు. గురువారం నేతాజీ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాకు మీరక్తాన్ని ఇవ్వండి మీకు నేను దేశాన్ని ఇస్తాననే నినాదాన్ని నేతాజీ ప్రజల్లో తీసుకువచ్చి సైన్యాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ వేషధారణలో..

తాండూరు టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం తాండూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ గురుదేవ్ గురుకుల్ విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ వేషధారణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ యువజన సంఘం సభ్యులు, స్థానిక కౌన్సిలర్ సోమశేఖర్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, రామకృష్ణ, శివకుమార్, వెంకటేష్, వెంకట్, బస్వరాజ్, వివేక్ తదితరులు ఆయన విగ్రహం ఎదుట నివాళులర్పించారు.



పరిగి: సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నాయకులు

నేడు ఎమ్మెల్యే బీఎంఆర్ రాక

తాండూరు: ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం తాండూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మొదటగా తాండూరు మున్సిపల్ పరిధిలోని బస్వణ్ణకట్ట ప్రాంతంలో 33వ వార్డు సభకు హాజరవుతారు. అనంతరం బషీరాబాద్ మండలంలోని నవల్గా, కొర్విచెడ్ గ్రామాల్లో జరిగే ప్రజాపాలన సభలకు ఎమ్మెల్యే హాజరు కానున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న జగనమ్మ

సాక్షి ఎఫెక్ట్..

దోమ : అంగన్వాడీ సెంటర్లపై టీచర్లు నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని సీడీపీఓ మెహర్ ఉన్నీసా బేగం హెచ్చరించారు. గురువారం సాక్షి దినపత్రికలో అంగన్వాడీ సరుకులు పక్కదారి అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌ను సూపర్‌వైజర్ జగనమ్మతో సందర్శించి రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న సరుకులు సక్రమంగా ఇస్తున్నారా? లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల: వాహన ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. గురువారం మండలంలోని పలు రోడ్లపై ఉన్న మలుపులు, యూటర్న్‌ల వద్ద వేగ నియంత్రణ కోసం ట్రాఫిక్ బొలార్డ్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారుల వేగ నియంత్రణ చేసి ప్రమాదాలు జరగకుండా ఈ బొలార్డ్స్ పనిచేస్తాయని చెప్పారు. వీటిని మండలంలోని జాతీయ రహదారి మూడిమ్యాల నుంచి చిట్టెంపల్లి వరకు ఉన్న హైవే రోడ్డు పరిధిలో ప్రమాదాల జరిగే చోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్కేపల్లి చౌరస్తాలో బొలార్డ్స్‌ను ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



దూసకల్ ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం

షాద్‌నగర్: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిహాన్స్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, న్యూరో సైన్స్ ప్రతినిధి డాక్టర్ దవళ శుక్లా అన్నారు. ఈఅంశంపై మండల పరిధిలోని దూసకల్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి
- పల్లెల్లో జోరుగా గ్రామసభలు



కుల్కచర్ల: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



యాలాల: సంగెంకుర్దులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పథకాల పేరుతో కాలయాపన చేసిందన్నారు. ప్రజాపాలనలో అధికారులు నిష్పక్షపాతంగా అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. సమావేశంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కుల్కచర్లలో రూ.12లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. తిర్మలాపూర్ గ్రామంలో రూ.2.50 లక్షలతో సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

యాలాల: రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బెన్నూరులో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్ గ్రామాల్లో జరిగిన గ్రామసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మధ్యవర్తులకు అవకాశం లేకుండా నిజమైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం దశలవారీగా అమలు చేస్తుందన్నారు. లబ్ధిదారులు లిస్టుల్లో తమ పేర్లు రాలేదని ఆందోళన చెందరాదన్నారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

బషీర్‌మియాతండాలో..

మండలంలోని బషీర్‌మియాతండాలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ పుష్పలీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా లబ్ధిదారుల కోసం దరఖాస్తులు తీసుకున్నారు.

నిరంతర ప్రక్రియ

దౌల్తాబాద్/మోమిన్‌పేట: సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని.. ఎవరూ ఆందోళన చెందవద్దని దౌల్తాబాద్ ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని నందారం, కుప్పగిరి, కుదురుమళ్ల, బండివాడ, పోల్కంపల్లి, కుప్పగిరి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మోమిన్‌పేట మండల పరిధిలోని చీమల్‌ధరి, చంద్రాయన్‌పల్లి, దుర్గంచెర్వు గ్రామాల్లో సభలు నిర్వహించారు.

1661 దరఖాస్తులు

నవాబుపేట: మండల పరిధిలోని చిట్టిగిద్ద, గుబ్బడిపత్తేపూర్ కడిచర్ల, మాదిరెడ్డిపల్లి, మూలమాడ, నారెగూడ, యావాపూర్, ఎల్లకొండ గ్రామాల్లో గురువారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. 1661 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జైరాం తెలిపారు.

సందేహాల నివృత్తి

దుద్యాల్: మండలంలోని చిలుముల మైల్వార్‌లో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దార్ కిషన్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేశారు. కుదురుమల్ల, నాజుఖాన్‌పల్లి గ్రామాల్లో సైతం సభలు నిర్వహించారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్, చెన్‌గేస్‌పూర్, చింతమణిపట్నం, ఐనెల్లి, వీరారెడ్డిపల్లి, బెల్కటూర్, నారాయణపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. పేదలకే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని నాయకులు, అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కొడంగల్ రూరల్: అర్హత ఉండి జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని పర్సాపూర్ గ్రామ ప్రత్యేకాధికారి, ఎంఈఓ కల్వకోటి రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పర్సాపూర్, రావులపల్లి, అంగడిరాయిచూర్, రుద్రారం, కస్తూర్‌పల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి, ప్యాలమద్ది గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమం కోసం..

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సమర్థవంతంగా నిర్వహిస్తోందని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమల్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 21వార్డు నుంచి 30వ వార్డుల్లో చైర్‌పర్సన్ అధ్యక్షతన వార్డు సభలను నిర్వహించారు.

కుత్బుల్లాపూర్‌లో..

పూడూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని పూడూరు తహసీల్దార్ భరత్‌గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో గ్రామ సభ నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు.

సజావుగా గ్రామసభలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారం తదితర గ్రామాల్లో గురువారం గ్రామసభలు సజావుగా సాగాయి. ప్రత్యేకాధికారులు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్, ఏడీఏ శంకర్‌రాథోడ్, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

అనర్హులకు ఇళ్లు మంజూరు

కొడంగల్: మున్సిపల్ పరిధిలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని గురువారం పలు వార్డుల్లో ప్రజల నుంచి విమర్శలు వచ్చాయి. ఖాళీ స్థలం ఉండి అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాలేదని మహిళలు ఆరోపించారు. 9, 10, 11, 12 వార్డుల్లో ప్రజాపాలన సభలు జరిగాయి. ఖాళీ స్థలం ఉండి అర్హత ఉన్న వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో మహిళలు ఆందోళనకు దిగారు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రస్తుతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

శంకర్‌పల్లి: విద్యార్థులు ఇష్టంగా చదివి.. జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని హాలింగాపురం ఉన్నత పాఠశాల గురువారం పదో తరగతి విద్యార్థులకు విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నరహరి, లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ భవానీ యాదగిరి, ఉపాధ్యాయులు అంజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

షాబాద్: బాధిత కుటుంబాలకు తమ సంఘం అండగా ఉంటుందని శ్రీ మల్లికార్జున కురుమ పాదువు సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మందుముల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతుడి భార్య లక్ష్మమ్మకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని తంగళ్లపల్లిలో లో ఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌గౌడ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌గౌడ్, గ్రామస్తులు నారాయణచారి, రామకృష్ణ, శివకృష్ణ, రమేష్, జంగయ్య,పాల్గొన్నారు.